బీజేపీలోకి మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్



ఈటల సమక్షంలో బీజేపీలో చేరుతున్న మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్

శామీర్‌పేట్: ఉమ్మడి శామీర్‌పేట మండల మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చంద్ర శేఖర్‌యాదవ్ సోమవారం బీజేపీలో చేరారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో చేరారు. చంద్రశేఖర్‌యాదవ్‌తో పాటు సుమారు 300 మంది అనుచరులు పార్టీలో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీలోకి పెద్దఎత్తున చేరికలు

కీసర: ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నేతలు పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతున్నట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆర్‌ఎల్‌నగర్‌కు చెందిన జూలకంటి రమేష్‌గుప్తా తన అనుచరులతో కలిసి మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి సమక్షంలో మంగళవారం బీజేపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని ఖాయమన్నారు. బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌రెడ్డి, నేతలు మెట్టు కృష్ణాయాదవ్, రవి, మెట్టు మహేందర్‌యాదవ్, ఆంజనేయలు, రాజశేఖర్‌రెడ్డి, పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

అఫిడవిట్‌లో తప్పులుంటే.. అభ్యర్థులకు తిప్పలే..!

రేపటి నుంచి నామినేషన్ల ఘట్టం ప్రారంభం

- అన్ని కాలమ్స్ పూరించాల్సిందే..
- నేర సమాచారం తప్పనిసరిగా ఉండాలి
- ఆస్తులు, అప్పులు పక్కా ప్రస్తావించాలి
- అభ్యర్థుల వివరాలు తెలుసుకోవడం ఓటర్ల హక్కు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్లు దాఖలు సందర్భంగా అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్ కీలకంగా మారుతోంది. అభ్యర్థులు తమ వివరాలతో పాటు ఆస్తులు, అప్పుల గురించి ప్రమాణ పత్రం రూపంలో ముందే స్పష్టం చేయాల్సి ఉంటోంది. గతంలో ఏమైనా కేసులు ఉన్నా.. శిక్ష పడినా వాటిని పొందుపరచాలి. వీటిని కలిపి దాఖలు చేసే పత్రమే అఫిడవిట్. అందులో తప్పుడు సమాచారమిస్తే మాత్రం అదే ప్రత్యర్థులకు ఆయుధమై కోర్టు కేసుల వరకు వెళ్లడమే కాకుండా అనర్హత వేటుకు దారితీసే అవకాశం ఉంటుంది. గురువారం నుంచి పార్లమెంట్ సాధారణ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానుండటంతో అభ్యర్థులు నామినేషన్ దాఖలు సందర్భంగా సమర్పించే అఫిడవిట్‌లో తప్పులు లేకుండా చూసుకోవాల్సి బాధ్యత వారిపైనే ఉంటుంది.

వివరాలు తెలుసుకోవడం ఓటర్ల హక్కు

ప్రజాప్రతినిధిగా ఎన్నుకోబోయే అభ్యర్థి వివరాలను తెలుసుకోవడం ఓటర్ల హక్కు. అప్పుడే అభ్యర్థులపై ఓ స్పష్టత వస్తోంది. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేస్తోంది. అందులో భాగంగానే అభ్యర్థులు తమ నామినేషన్‌తో పాటు అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల నిబంధనలకు లోబడి ఫామ్–26 రూపంలో అభ్యర్థులు అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటోంది. ఇందులో అభ్యర్థుల ఆస్తులు, అప్పులు, కేసుల సమాచారంతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు తెలపాల్సి ఉంటుంది.

అన్నీ కాలమ్స్ పూరించాల్సిందే..

అఫిడవిట్‌లోని ఏ ఒక్క కాలమ్ ఖాళీగా వదలరాదని ఎన్నికల సంఘం(ఈసీ) స్పష్టం చేస్తోంది. అభ్యర్థులకు సంబంధం లేకపోతే ఆ కాలమ్‌లో 'నిల్ లేదా వర్తించదు' అని రాయాలని తెలిపింది. అభ్యర్థి సమర్పించిన అఫిడవిట్‌ను గమనించి ఏదైనా సమాచారం లేకపోతే ఆర్‌ఓ నోటీసు ఇస్తారు. అప్పుడు సవరించిన అఫిడవిట్‌ను అభ్యర్థి అందించాల్సి ఉంటోంది. అయినప్పటికీ పూర్తిస్థాయి వివరాలతో అఫిడవిట్ లేకపోతే పరిశీలన (స్క్రూటీ) సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురవుతోంది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లను ఆర్‌ఓలు నోటీసు బోర్డు, వెబ్‌సైట్లో పొందుపరుస్తారు.

నేర సమాచారం తప్పనిసరి

క్రిమినల్ కేసులు నమోదై ఉంటే వాటి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాల్సి ఉంటోంది. ఏదైనా కేసులో న్యాయస్థానాలు గతంలో శిక్ష విధించినా, అప్పీల్‌కు వెళ్లినా వాటి సమాచారాన్ని ప్రస్తావించాల్సి ఉంటోంది. సామాజిక మాధ్యమాల ఖాతాలను తెలిపాల్సి ఉంటోంది. అన్ని వివరాలతో కూడిన అఫిడవిట్‌కు నోటరీ తప్పనిసరి. సాధారణంగా నామినేషన్ దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) ముందు అభ్యర్థి ప్రమాణం చేస్తారు. వేరే ఎవరైనా నామినేషన్ సమర్పిస్తే సదరు అభ్యర్థి తాను ఉన్న ప్రాంతంలోని మెజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేయాల్సి ఉంటుంది. అంతేగాకుండా అభ్యర్థులపై నమోదైన కేసుల వివరాలను ప్రముఖ దినపత్రికల్లో స్పష్టంగా కనిపించేలా ప్రకటన ఇవ్వాల్సి ఉంటోంది.

ఆస్తులు, అప్పులను పక్కాగా ప్రస్తావించాల్సిందే..

స్థిర, చరాస్తుల వివరాలతో పాటు చేతిలో, బ్యాంకు ఖాతాల్లోని నగదు, డిపాజిట్లు, ఇతర సేవింగ్స్, బీమా పాలసీలు, అప్పులు తదితరాలు పొందుపర్చాల్సి ఉంటోంది. ఆభరణాలు, వాహనాలు, వ్యవసాయ భూములు, వాణిజ్య సముదాయాలు, నివాస స్థలాల వంటి వాటిని అఫిడవిట్లో ప్రస్తావించాలి. అవి వారసత్వంగా వచ్చాయా.. కొనుగోలు చేశారా అన్నది కూడా తెలపాల్సి ఉంటోంది. స్థిరాస్తులకు సంబంధించిన ప్రస్తుత మార్కెట్ విలువను పొందుపర్చాల్సి ఉంటోంది. అభ్యర్థితో పాటు కుటుంబ సభ్యుల పేరిట రుణాలు ఉంటే వాటి వివరాలనూ ప్రస్తావించాలి. కుటుంబ సభ్యుల ఆదాయ మార్గాలు, ప్రభుత్వం లేదా ప్రైవేటు కంపెనీల కాంట్రాక్టులు ఉంటే వాటి వివరాలు తెలియజేయాల్సి ఉంటోంది. అభ్యర్థులు ఫామ్–26 ద్వారా అఫిడవిట్‌ను ఎన్నికల నిబంధనలకు లోబడి సమర్పించాల్సి ఉంటోంది. ఆస్తులు, అప్పులు, నేర వివరాలు కచ్చితత్వంతో ఉండాల్సి ఉంది. తప్పుడు సమాచారమిస్తే న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవాల్సి ఉంటోంది.

శ్రీరామనవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబు



నాగారంలో సీతారామాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు అభిషేక పూజలు

కీసర: శ్రీరామ నవమి వేడుకలకు మండలంలోని వివిధ గ్రామాల్లోని సీతారామంజనేయస్వామి దేవాలయాలు ముస్తాబయ్యాయి. ప్రఖ్యాత శైవక్షేత్రమైన కీసరగుట్ట, చీర్యాల దేవాలయం, కీసర, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు ప్రజయ్‌సాయిగార్డెన్, రాంపల్లిలోని రామాలయం, నాగారంలోని శ్రీరమా సత్యనారాయణ ఆలయాలను ముస్తాబు చేశారు. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాలకు ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు.

నాగారంలో ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు

నాగారంలోని శ్రీరమా సత్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మంగళవారం శ్రీసీతారామాంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో విశేష అభిషేక పూజలను నిర్వహించారు. కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



కీసర: రాంపల్లిలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి జోయెల్ లక్ర ప్రతిష్టాత్మకమైన విక్రమ్ సారాబాయ్ సైన్స్ ఫౌండేషన్(వీఎస్ఎస్ఎఫ్) దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో అర్హత సాధించి త్రివేండ్రమ్‌లో నిర్వహించే ఫైనల్ పరీక్షకు ఎంపికయ్యాడు. ఈమేరకు మంగళవారం జోయెల్ లక్రను పాఠశాల చైర్మన్ టి.హరిశ్చంద్రప్రసాద్ అభినందించి రూ.10 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. అకాడమిక్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమోద్ శామ్ జోయిస్, పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుచరితరాయ్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పథకాలను ప్రతి ఇంటికీ వివరించాలి



జవహర్‌నగర్‌లో సమావేశంలో రాగిడి రజిత, బీఆర్‌ఎస్ నాయకులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రాగిడి రజిత హాజరై మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో చేసిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మేక లలితాయాదవ్, నాయకులు నర్సింహయాదవ్, సిద్ధులుయాదవ్, ప్రకాష్, బాలరాజు, మహేందర్‌యాదవ్, సతీష్ యాదవ్, ఎల్లస్వామి, ఖాసీ, రమేష్‌బాబు, జెమ్స్, సంధ్య, మంజుల, స్వప్న, లక్ష్మీ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీసీతారాములోరి కల్యాణం



ఆలయంలో కొలువైన శ్రీసీతారాములు



ఘనాపూర్‌లో అందంగా ముస్తాబయిన శ్రీసీతారాముల ఆలయం

ఘట్‌కేసర్: శ్రీసీతారాములోరి కల్యాణ వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఘనాపూర్, చౌదరిగూడ, శివారెడ్డిగూడ, ఘట్‌కేసర్, అవుషాపూర్, ఎదులాబాద్‌లో శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు శ్రీరామచంద్ర స్వామి, శ్రీజనక మహరాజు పుత్రిక శ్రీసీతాదేవి కల్యాణం నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణ మండపాలను శుభ్రం చేసి పందిళ్లు వేశారు. స్వామి వారి కల్యాణం, దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణ వేడుకల అనంతరం భక్తులకు అన్నదానం చేసేందుకు అంతా సిద్ధం చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

శ్రీరామనవమికి ఏర్పాట్లు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో బుధవారం నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శ్రీగిరివేంకటేశ్వర స్వామి ఆలయ సమీపాన గల కల్యాణవేదిక వద్ద నిర్వహించనున్నారు. ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం సమయానికే పూర్తి చేశారు. అన్నోజిగూడలోని అయ్యప్ప ఆలయం, రాజీవ్ గృహకల్పలోని హనుమాన్ గుడి, ఎన్టీపీసీ రోడ్‌లోని ఓంకార క్షేత్రం, నారపల్లిలోని హనుమాన్ ఆలయం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేశారు.

ఆస్పత్రిలో రక్తపరీక్షల సమయం పెంచాలి



వినతి అందజేస్తున్న యాదయ్య, సబిత

ఘట్‌కేసర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రక్త పరీక్షల సమయం పెంచాలని సీపీఎం నాయకులు ఆస్పత్రి సూపరింటెండెంట్ కోట్యనాయక్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. వందలాది మంది రోగులకు పరీక్షలు అవసరం ఉండగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే రక్త పరీక్షలు చేస్తున్నారని లేఖలో తెలిపారు. పెరిగిన రోగుల సంఖ్యకు అనుగుణంగా రక్త పరీక్షల సమయం సాయంత్రం 6 గంటల వరకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యాదయ్య, సబిత, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఎమర్జింగ్ టెక్నాలజీపై అవగాహన అవసరం



జాతీయ సదస్సులో విద్యార్థులు, అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులకు ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై అవగాహన ఎంతో అవసరమని జేఎన్‌టీయూహెచ్ సీఎస్ఈ హెచ్‌ఓడీ సుప్రీతి అన్నారు. గుండ్లపోచంలపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కార్పొరేట్ రంగంలో డిజిటల్ మార్కెటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి టెక్నాలజీస్ సమాజంలోని మనిషి మేదస్సు పెంపొందించడంలో, సైబర్ నేరాల నుంచి జీవితాలకు భద్రత కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయిని తెలిపారు. కళాశాల సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్ మాట్లాడుతూ జాతీయ సదస్సులో నూతన సాంకేతికతపై అవగాహన కల్పించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోకనాథం, కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, డీన్ రామసుబ్బారెడ్డి, హెచ్‌ఓడీ సుజిత్, కన్వీనర్ దిలీప్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవిత ప్రథమ చికిత్స కేంద్రం సీజ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్ర వైద్య మండలి చైర్మన్ ఆదేశాల మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని గుండ్లపోచంపల్లి కవిత ప్రథమ చికిత్సా కేంద్రాన్ని సీజ్ చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘునాథస్వామి తెలిపారు. ఎలాంటి అర్హతలు లేని నకిలీ వైద్యులు కవిత ప్రథమ చికిత్స కేంద్రంలో రోగులను పరీక్షించి, మందులు అందజేస్తున్నట్లు తాము నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైందన్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు, టీఎస్ఎంసీ చట్టం ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ చికిత్సా కేంద్రంపై పోలీసు కేసు నమోదైనట్లు డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. గుండ్లపోచంపల్లిలో సోమవారం నిర్వహించిన ఈ తనఖీల్లో వైద్యాధికారులు డాక్టర్లు నారాయణరావు, లావణ్య, శ్రీహస, శ్రీనివాస్, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



మున్సిపల్ ఉద్యోగుల సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్

జవహర్‌నగర్: మున్సిపల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను మంగళవారం టీఎస్‌జీవో మున్సిపల్ యూనియన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం దానకిషోర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ సెక్రటరీ సైదానాయక్, రాష్ట్ర కార్యదర్శి వెంకటగోపాల్, టీఎస్‌జీవో రాష్ట్ర అధ్యక్షులు జగదీశ్వర్, కిషన్, వివిధ జిల్లాల యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

బోడుప్పల్: క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు బోధించాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం ఈ విద్యా సంవత్సరం క్రమశిక్షణ, సమయపాలన, స్కూల్ యూనిఫామ్ ధరించిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి ప్రశంసా పత్రాలను ఆయన చేతులమీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు గొప్ప నాయకత్వ లక్షణాలను అలవర్చుకున్నారన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్నారన్నారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రుల కృషి ప్రశంసనీయం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం

మేడ్చల్: పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా మేడ్చల్ పట్టణంలోని వివిధ కాలనీల్లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని వెంకట్రామయ్య కాలనీ, చంద్రనగర్, ఉమా నగర్, గోకుల్‌నగర్, బాలాజీనగర్, రాఘవేంద్రనగర్, ఎన్‌జీఓ కాలనీల్లో నాయకులు పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, నాయకులు మల్లేష్‌గౌడ్, శ్రవణ్‌కుమార్ గుప్తా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్ దేవ, బాల్‌రెడ్డి, బాలమల్లేష్, వెంకటేష్, రవి, శ్రీనివాస్‌గౌడ్, నాగభూషణం, రఫీ తదితరులు పాల్గొన్నారు.



నరేశ్‌గౌడ్‌కు కండువా కప్పుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరిక

ఘట్‌కేసర్: కీసరగుట్ట ఆలయ మాజీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ నాయకుడు నరేశ్‌గౌడ్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.



ఎన్‌జీఓ కాలనీలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ఘట్‌కేసర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం, బియ్యం

ఘట్‌కేసర్: అక్రమంగా తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా తుర్కపల్లికి చెందిన గుగులోతు బద్య మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మహింద్రజీతో వాహనంలో తరలిస్తుండగా బొక్కనిగూడ వద్ద స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా స్థానికంగా తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో ఇటుక బట్టీలో పనిచేసే కార్మికులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కోదండరామ స్వామి ఆలయంలో పూజలు

హబ్సిగూడ: హబ్సిగూడలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి బంగారు కిరీటం అలంకరణ పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు యాదవరెడ్డి, మల్లారెడ్డి, కొండల్‌రెడ్డి, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆగిరెడ్డి, క్రాంతిరెడ్డి, సుధాకర్, గిరిబాబు, ఉపేందర్‌రెడ్డి, గణేష్‌నాయక్, ధర్మేందర్‌నాయక్, పవన్, విజయ్, రమేష్‌నాయక్, రాజు, బాబురావు, రామునాయక్, షబ్బీర్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకోదండ రామస్వామి ఆలయంలో పూజల్లో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి